

బాగ్‌అంబర్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిధుల కేటాయింపులో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

● కాంగ్రెస్ నేత తొలుపునూరి కృష్ణగౌడ్

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌అంబర్‌పేటలో బడ్జెట్‌కు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై ప్రధాని మోదీ కక్షకట్టారని ధ్వజమెత్తారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ని రసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నాయకులు పోలినేని రామారావు, శ్రీమంత్‌గిరి, షౌకత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించాలి

●తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల సంక్షేమానికి కాదని, కార్పొరేట్ బడ్జెట్ అని తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్ ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నైతిన బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆదివారం బర్కత్‌పురలో రవి కుమార్ విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చిన తెలంగాణకు బడ్జెట్‌లో అన్యాయం చేయడం మోదీ ప్రభుత్వానికే దక్కిందని విమర్శించారు. బడ్జెట్‌లో తెలంగాణకు రావాల్సిన వాటా గురించి బీజేపీ ఎంపీలు ప్రశ్నించకపోవడం వల్లే నిధుల కేటాయింపులో మోదీ ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపిందన్నారు. పసుపు బోర్డు, వ్యవసాయ ఉత్పత్తులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపో వడం వల్ల రాష్ట్ర రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం

● బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ



విలేకరులతో మాట్లాడుతున్న ముఠా జైసింహ

ముషీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆరోపించారు. ఆదివారం ఆయన భోలక్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్షపూరిత ధోరణితో వ్యవహరించి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. బీజేపీ ఎంపీలు 8మంది ఉన్నప్పటికీ తెలంగాణ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు డి. శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై తప్పుడు ప్రచారం తగదు

●బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్



రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమపాళ్లల్లో బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్‌లోని లలితానగర్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. ముఖ్యంగా ఇన్‌కామ్ టాక్స్ పరిమితి 12 లక్షలకు పెంచడం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో దోహదపడుతుందన్నారు. క్యాన్సర్ మందుల ధరలను తగ్గించడం వల్ల క్యాన్సర్ రోగులకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశ ఆర్థిక స్థితినిమెరుగుపరిచే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారని సాయికృష్ణయాదవ్ పేర్కొన్నారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే బడ్జెట్

●కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రవేశ పెట్టినందుకు కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు చౌరస్తాలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి రవీందర్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, రంగరాజ్‌గౌడ్, సురేష్‌ముదిరాజ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ ప్రభాకర్ గంగపుత్ర, శ్రీనివాస్‌ముదిరాజ్, మీసాల విఠల్‌రావు, లింగంగౌడ్, బియ్యం శ్రీనివాస్, చంద్రశేఖర్ వాసు తదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరిని సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి, జస్టిస్ రాధారాణి తదితరులు

శంకరమఠంలో హరికథా మహోత్సవాలు ప్రారంభం

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి 73వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం నల్లకుంటలోని శంకరమఠంలో హరికథా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాలను డాక్టర్ కేవీ రమణాచారి, జస్టిస్ రాధారాణి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హరికథలకు ప్రజాదరణ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించగా ప్రముఖ హరికథా భాగవతురాలు ఉమామహేశ్వరి, ప్రముఖ సాహితీవేత్త వి.హర్షవర్ధన్, భోగరాజు మూర్తి, మూగపాటి అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు.

ప్రభుత్వాసుపత్రిలో తాగునీటికి కటకట

● ముషీరాబాద్ యూపీహెచ్‌సీ నీటి సదుపాయం నిల్

● ఇబ్బందులు పడుతున్న వైద్య సిబ్బంది, రోగులు

● రోజూ మినరల్ వాటర్ బాటిళ్ల కొనుగోలు



ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముషీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ), భోలక్‌పూర్ యూపీహెచ్‌సీల్లో తాగునీరు లేకపోవడంతో ఆసుపత్రి వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ మినరల్ వాటర్ కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది.

ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో ఒకే ప్రాంగణంలో భోలక్‌పూర్, ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ), చిక్కడపల్లి హోమియోపతి ఆసుపత్రి, ముషీరాబాద్ టీబీ ఆసుపత్రి, మలేరియా శాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రులకు సంబంధించిన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు వంద మందికి పైగా ఉండగా, ప్రతి రోజూ వివిధ్య ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులు 300లకు పైగా ఉంటారు. ఆసుపత్రిలో తాగడానికి నీళ్లలేకపోవడంతో వైద్య సిబ్బందితో పాటు రోగులు ఇబ్బందిపడుతున్నారు. ఉన్న పవర్ బోర్ సైతం పాడైపోవడంతో నీళ్లులేక ఇబ్బంది పడుతున్నారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీకి కనీసం పవర్ బోరు నీళ్ల సౌకర్యం లేకపోవడం వల్ల వైద్యసిబ్బంది స్థానికంగా ఉన్న మెట్రోస్టేషన్‌లో కాలకృత్యాలు తీర్చుకొనేందుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తాగునీటి కనెక్షన్ లేకపోవడం వల్ల వైద్య సిబ్బంది ప్రతిరోజూ 20 లీటర్ల మినరల్ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాం



ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంచినీటి కనెక్షన్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేశాం. ప్రతి రోజూ తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, కొత్తగా మంచినీటి కనెక్షన్ ఇప్పించాలని కోరాం. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని జలమండలి ఉన్నతాధికారులను ఆదేశించారు.

- డాక్టర్ మనోజ్‌రెడ్డి, యూపీహెచ్‌సీ వైద్యాధికారి

దరఖాస్తు చేసుకుంటే కనెక్షన్ ఇస్తాం



ఆసుపత్రి అధికారులు దరఖాస్తు చేసుకుంటే తాగునీటి కనెక్షన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మంచి నీటి కనెక్షన్ ఇచ్చేవరకు వాటర్ ట్యాంక్ ద్వారా ఆసుపత్రికి నీటిని సరఫరా చేస్తాం.

- మోహన్‌రాజ్, జలమండలి డీజీఎం

కనకదుర్గమ్మపై పాట ఆవిష్కరణ



ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న జనార్దనమూర్తి, శంకరనారాయణ తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హాస్యబ్రహ్మగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ పాత్రికేయుడు శంకరనారాయణ కనకదుర్గమ్మపై విశేషమైన భక్తితో వీనుల విందయిన చక్కటి పాటను రాశారని త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అన్నారు. ఇదే కాకుండా శంకరనారాయణ అనేకమంది దేవుళ్ల మీద 35 శతకాలు రాశారన్నారు. శంకరనారాయణ కనకదుర్గమ్మ మీద రాసిన పాట ఆడియో సీడీని త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జనార్ధన మూర్తి మ ట్లాడుతూ, ఈ పాటకు పాటల రచయిత, స్వరకర్త రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరకల్పన చేసి అద్భుతంగా గానం చేశారని అభినందించారు. శంకరనారాయణ మాట్లాడుతూ,కనకదుర్గమ్మ అంటే తనకు ప్రత్యేకమైన భక్తి ప్రపత్తులున్నాయన్నారు. పాటను మనస్సుకు హత్తుకునేలా రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరపరచిభక్తి పరవశం పొందేట్లు గానం చేశారన్నారు. ఇందుకు దోర్బల లిఖిత్ మంచి సంగీతం అందించారన్నారు. కార్యక్రమంలో గుండవరపు గీతాదేవి, పేరి అన్నపూర్ణశ్రీరామ్ పాల్గొన్నారు.

'బాలోత్సవం' చిన్నారుల అభినందన సభ



బాలోత్సవంలో ప్రతిభ చూపిన చిన్నారులను సన్మానిస్తున్న భూపతి వెంకటేశ్వర్లు, సుజావతి తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బాలోత్సవం సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన బాలోత్సవ వేడుకల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అభినందన సభ భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. బాలోత్సవ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు 256 మంది భారతీయ ధీరవనితల స్ఫూర్తి పాత్రలను ప్రదర్శించి మన్ననలందుకున్నారని తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో ప్రవాస భారతీయులు జాస్తి శివరామకృష్ణ, సంస్థ ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, కవయిత్రి మమత, సభ్యులు రూప, రుక్మిణి, నవీన్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి

●ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బస్తీవాసులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలందించేందుకు అంబర్‌పేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ముఖ్యంగా దగ్గు, జ్వరం, వాంతుల ఇతరత్ర వాటి పట్ల ప్రజలు ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆదివారం నల్లకుంట డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ దవాఖానాలో రోగులకు మందులు, వైద్య సిబ్బంది ఇతరత్ర సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇందిరానగర్ బస్తీ అధ్యక్షుడు ప్రకాశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురేశ్‌లను వారి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. వైద్య చికిత్సల కోసం వారికి ఆర్థిక సాయం అందించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు శంకర్‌గౌడ్, పి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య తదితరులు

తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో 'కార్పొరేట్' బడ్జెట్‌కు వ్యతిరేకంగా 10న మహాధర్నా

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ వర్గాలకు అనకూలమని పలువురు నేతలు ఆరోపించారు. గత బడ్జెట్ కంటే రూ. 3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీ లోటు 4. 4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సుందర య్యవిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడారు. కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు.

రూ. 50, 65, 345 కోట్లతో 2025 - 26 కేంద్ర బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమ, ఎం.ధర్మానాయక్, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్


కార్మికవర్గానికి గుర్తింపు లేకపోవడం బాధాకరం

● జస్టిస్ బి.చంద్రకుమార్

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి కావాల్సిన అన్ని రకాల ఉత్పత్తులను తయారు చేసే కార్మిక వర్గానికి గుర్తింపు లేకపోవడం బాధాకరం అని జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఎన్) ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు మోడం మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కార్మిక రంగానికి ఎలాంటి కేటాయింపులు జరగలే దన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర వివక్ష చూపిస్తున్నదన్నారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ అమలు కావడం లేదన్నారు. కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు గుర్రం విజయ్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు గణేష్‌పాండ, ఉప్పలయ్య, రాంచందర్, ప్రసాద్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నందరాజ్‌గౌడ్ సేవలు స్ఫూర్తిదాయకం

●బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రావు. చిత్రంలో మాజీమంత్రి కృష్ణాయాదవ్ తదితరులు

నల్లకుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పటిష్టత కోసం పనిచేయడంతోపాటు నిరంతం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి దివంగత నందరాజ్‌గౌడ్ అని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్‌లు కొనియాడారు. నాడు అయోధ్య కరసేవలో ముందున్న వీర సైనికుడు నందరాజ్‌గౌడ్ అని శ్లాఘించారు. మాజీ కార్పొరేటర్, షాహీద్ నందరాజ్‌గౌడ్ 32వ వర్ధంతి ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని నందరాజ్‌గౌడ్ స్మారక స్తూపం వద్ద అంబర్‌పేట నియోజకవర్గ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు నందరాజ్‌గౌడ్ స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో బీజేపీ పార్టీ పటిష్టతకు నందరాజ్‌గౌడ్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నందరాజ్‌గౌడ్ కలలుగన్న భవ్యదివ్యమైన అయోధ్య రామమందిరం నిర్మాణం పూర్తి కావడంతో ఆయన ఆశయ సాధన పూర్తయిందని వారన్నారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్లు యాకర అమృత, కన్నె ఉమాదేవి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి, నందరాజ్‌గౌడ్ సతీమణి లలితాగౌడ్, కుమారుడు ఎం.రోహిత్ నందరాజ్‌గౌడ్, బీజేపీ నాయకులు చుక్క జగన్, ఏడెల్లి అజయ్‌కుమార్, దత్తు, శ్యామ్‌రాజ్, చుక్కా జగన్, ప్రశాంత్ జోషి, జి.మల్లేష్, కృష్ణగౌడ్, బాలకృష్ణగౌడ్, ఏడెల్లి భాస్కర్, శ్రీధర్‌గౌడ్; యశ్వంత్, ప్రవీణ్‌కుమార్, నాగారాచారి, సాయిఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ప్రతిపత్తి కమిటీని ఏర్పాటు చేయాలి

●ఇండిపెండెంట్ చర్చి అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌బాబు

ముషీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హెబ్రోన్ చర్చి కార్యక్రమాలు సజావుగా సాగడానికి స్వయం ప్రతిపత్తి కలిగిన పెద్దలతో కమిటీని ఏర్పాటు చేయాలని ఇండిపెండెంట్ చర్చి అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌బాబు అన్నారు. ముషీరాబాద్‌లోని కషిష్ ఫంక్షన్ హాల్‌లో హెబ్రోన్ చర్చి ప్రతినిధి ప్రవీణ్ అధ్యక్షతన నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చర్చి ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గోల్కొండ చౌరస్తా వద్ద గల ప్రసిద్ధిగాంచిన హెబ్రోన్ చర్చిలో జరుగుతున్న పరిణామాలపై శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో రెవరెండ్‌లు భాస్కర్, ప్రసాద్ చౌదరి, జోనాతాన్, బిషప్ జాన్ గొల్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని కెనరాబ్యాంక్ పార్కు జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో ఆదివారం హైదరాబాద్ తైక్వాండో మార్షల్ ఆర్ట్ నిర్వాహకుడు మాస్టర్ బి. కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్‌గ్రేడింగ్, కలర్స్, బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్లు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వినయ్‌కుమార్ 80 మందికి బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మీర్ వహాజ్ అలీ, ఎగ్జామినర్ సంజయ్‌సింగ్, కోచ్‌లు మనీష్, రఘు, స్వామి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు కాలేదనడం సరికాదు

● కాంగ్రెస్ నాయకుడు తేజాగౌడ్



ఎంపీ లక్ష్మణ్‌కు లేఖ పోస్ట్ చేస్తున్న తేజాగౌడ్ తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటికి కేటాయించిన నిధులను, వివరాలను తెలియజేస్తూ ఒక లేఖను బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌కు సీనియర్ కాంగ్రెస్ నాయకు డు తేజాగౌడ్ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్‌లో తేజాగౌడ్ విలేకరులతో మాట్లాడతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో అర గ్యారంటీ కూడా అమలు కాలేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ పేర్కొనడం సరికాదన్నారు. ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని, ఏటా కోటిమందికి ఉద్యోగాలిస్తామని చెప్పిన ప్రధానమంత్రి ఎంతమందికి 15 లక్షలు వేశారో, ఎన్ని ఉద్యోగాలిచ్చారో తెలపాలని లక్ష్మణ్‌ను తేజాగౌడ్ ప్రశ్నించారు. ఇప్పటికైనా లక్ష్మణ్ వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు.

సీఎంకు భోలక్‌పూర్ కాంగ్రెస్ నేతల సన్మానం



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన మేడి సురేష్ కుమార్ తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు మేడి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇచ్చేలా తమ వంతు కృషిచేస్తున్నామని ఈ సందర్భంగా వారు సీఎంకు తెలియజేశారు. ముఖ్య మంత్రిని కలిసిన వారిలో నాయకులు ప్రవీణ్, సత్యనారాయణ, రఘు తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న పిడమర్తి రవి

బాబుపై ప్రేమ, రేవంత్‌రెడ్డిపై ద్వేషం వెళ్లగక్కుతున్న మందకృష్ణమాదిగ

●ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఏపీ సీఎం చంద్రబాబుపై ప్రేమ ఒలకబోస్తూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై ద్వేషం వెళ్లగక్కుతున్నాడని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆరోపించారు. 'లక్ష డప్పులు- వెయ్యి గొంతుల' కార్యక్రమం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా తెలంగాణ మాదిగలు సీఎం రేవంత్‌రెడ్డి వెంటే ఉంటారని స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిడమర్తి రవి మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ అమలుపై బీజేపీ, మందకృష్ణ మాదిగలకు ఇష్టం లేదని ఆరోపించారు. వర్గీకరణ విషయంలో బీజేపీకి క్రెడిట్ రావాలని మందకృష్ణ మాదిగ ఎంత ప్రయత్నం చేసినా ప్రజలు ఒప్పుకోరని అన్నారు. బీజేపీ, మందకృష్ణ మాదిగల కుట్రలను ప్రజలు తిప్పికొట్టి వర్గీకరణ అమలును సాధించుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ మీసాల మల్లేశం, డాక్టర్ నర్సింహ మాదిగ, రాంబాబు, బోరేల్లి సురేష్, బోయిన ఎల్లేష్, రవి, సాయిలు, దేవరకొండ నరేష్, మీసాల మహేష్, కృష్ణ, వేణు, రాహు తదితరులు పాల్గొన్నారు.